# ఆకాశదీపం

క్రదులుతున్న కారాగిపోయింది.

రాధ పెళ్ళి గురించి నాలో సాగుతున్న ఆలోచనలూ తాత్కాలికంగా ఆగిపోయాయి కారుఆగటానికి కారణంనాకు తెలియదు. నేను తలఎత్తి డ్రైవర్ వీర్రాజు వైపుచూచేసరికి, అతను కారుదిగి, నే కూర్చున్న వైపున విండో దగ్గరకి వచ్చి తలవంచి "అల్లదే మాఊరు బాబూ!" అన్నాడు సవినయంగా అసాయం సమయంలో దారిప్రక్కన వింతగా మెరిసేచేలకు దూరముగా కనిపించి కనిపించక ఉండే ఒకపల్లెను చూపుతూ. రాధ ఆలోచనలతో సతమతమవుతున్న నేను, అతను కారాపి ఊరును పరిచయం చేయటంలో గల ఆంతర్యాన్ని కనిపెట్టప్రయత్నించక "అలాగ!" అని అన్నాను. నేనతనిని ఇంకా ఏదో అడిగాలన్నది అతని తాపత్రయం. అతనిచూపుల గ్రహించి "అయితే ఏమిటంటావు?" అన్నాను అసహనంతో.

వీర్రాజు నాగొంతులోని కరకుదనాన్ని గమనించినా, "అల్లదే మాఊరు బాబూ! ఆ ఊరికి నే వెళ్ళక మూడు సంవత్సరాలయింది. ఇంకా పైనే అయింది. అక్కడ మా అమ్మ ఉంది. మఃసిల్దిబాబూ! ఒక్కసారి చూచి వచ్చేస్తాను. ఇది తప్పితే మరి

నాకు అవకాశమేలేరాదు. మా అమ్మ కోసమే ఈ పళ్ళు బట్టలు కొన్నాను. ఈ సలభై రూపాయలు చేతిలోపెట్టి వస్తాను. బాబూ! ఒక్కసారి" జేబులోంచి పర్సుతీస్తూ అన్నాడు.

వెళ్ళిన పనిలో ఆశాభంగం ఎదురవగా, మనసు చికాకుగా ఉన్న పరిస్థితిలో వీర్రాజు చేసిన విన్నపమది. అతని మాటలు నాలో కుతూహలాన్ని రేపగా అన్నాను, "అయితే ఇంతకాలం ఆమెను చూడకండా ఉండగలిగావా వీర్రాజూ?" అని

వీర్రాజు తలదించుకుని, "ఏం చేయమంటారుబాబూ! మా ఆడది ఒక రాక్షసి. నన్ను వెయ్యికళ్ళతో కనిపెడుతూంటుంది. ఎప్పుడు కేంపు మీద వెళ్ళినా నేను ఇక్కడికే వచ్చానని దాని అనుమానం. ఒక్కొక్కప్పుడు దానిని చంపి పోగులుపెట్టి నన్నూచంపుకోవాలనిపిస్తుంది. కాని ఏం చేయను? నాకు నలుగురు పిల్లలు. అందుకని అది బ్రతికిపోయింది. ఇదే నాకుఅవకాశం. ఇది దాటితే నేనిటురావటం అవదు. ఆ కనిపించే కొబ్బరి తోటకు ఆనుకున్నదే మా ఊరు. కాని అంతవరకు కారు వెళ్ళదు. దారిలోవాగుంది, వాగుదాటి రెండుఫర్లాంగుల దూరంలో మాఊరు. వాగు ముందొక ఊరుంది. అంతవరకు మిమ్మల్ని తీసికెడతాను. మా అమ్మను చూచి గంటలో వచ్చేస్తాను. ఆ తరువాత మీ యిష్టం. ఎంత దూరమైనా ఎన్నిగంటలయినా డ్రైవ్ చేస్తాను" అన్నాడు. నా గుండె చెమ్మగిల్లింది. నెమ్మదిగా వీర్రాజు భుజంమీదచెయ్యివేసి "వీర్రాజూ నీవు మీ అమ్మను ఒక గంటసేపు చూడటంలో తృప్తిపడగలవేమో కాని నిన్ను అంత తొందరగా వదులుకోటానికి ఆమె ఇష్టపడదు. నాకు తెలుసు. ఒక రోజుకాదు. రెండురోజులు సెలవుతీసుకో. నిన్ను నా స్వంత పనిమీద పంపానని మీ యింటికి కబురు పెడతాను. నేను వెళ్తాను" అన్నాను.

(8)

వీర్రాజు కళ్ళలో నీళ్ళుతిరిగాయి "అన్ని రోజులు వద్దులెండి బాబుగారూ! మీరున్నారు కాబట్టి ఈ ఒక్కరాత్రి అవకాశ మివ్వండి. రేపుదయం కలిసి వెళ్ళిపోదాం. కాని ఈ రాత్రి మీకిబ్బందిగా ఉంటుంది. మిమ్మల్ని మా ఊరే మా యింటికే తీసికెడుదును. కాని వాగుదాటి మీరు నడవలేరు. వాగు ముందొక ఊరుందని చెప్పానుగా. ఆ ఊరిలో ఒక గుడిఉంది. ఆ గుడిలో పూజారి ఉన్నాడు అతను బ్రతికే ఉండిఉండాలి. ముసలివాడు. అతను వుంటే మీకే అసౌకర్యమూ ఉండదు. అతను లేకపోయినా మీరీ రాత్రి గడపడానికి ఏర్పాటు చేయగలను. ఏమంటారు? రేపుదయమే యిద్దరమూ కలిసి వెళ్ళిపోదాం" ఏనాడూ అతిగా మాట్లాడని వీర్రాజు నాతో అన్నాడు,

పల్లెటూళ్ళతో నాకు పరిచయం చాలతక్కువ. కథల్లో చదివి సినీమాల్లోచూచిన పల్లెమీద నాకు గౌరవముంది. అదోరకమైన మోజు ఉంది. ఎంతసేపూ ఫ్యాక్టరీవాసులమధ్య, ఫానుల క్రింద ఫోనుల ప్రక్క, మేడల్లోనూ, ఎయిర్‌కండిషన్డు గదుల్లోను గడిపిన నేను అనుకోకుండ ఎదురవుతున్న ఈ అనుభవాన్ని కాదనదలచుకోలేదు. సరే అన్నాను. వీర్రాజు సంతోషంతో కారును మట్టిరోడ్డువైపు పోనిచ్చాడు. రోడ్డు కిరువైపులా అంత దూరంలో చెఱకు తోటలున్నాయి. ఒకవైపుగా వరిచేలు ఏపుగాపెరిగి వయసొచ్చిన ఆడపిల్లలా తలవంచుకుని సిగ్గుపడుతూ, అదే పాటను వినిపించీ వినిపించనంత మెల్లగా పాడుకుంటున్నాయి చలిగాలిలో. గాలికి ఎగిరిపోతున్న పయ్యెదను బొడ్లో దోపుకుంటున్నట్టు ఒక్కసారి దగ్గరగా వస్తున్నాయి. వరికంకులు అదే సమయంలో ఎదో **గుస** గుస లాడుకుంటున్న సవ్వడి వినిపించకపోలేదు. మా కారు ఊరు మొదలులోకి ప్రవేశించింది. ఊరికిముందు విశాలమైనచెఱువుంది. ఆ చెఱువు నానుకునేఊరుంది. చెఱువు గట్టున రావి చెట్టుంది. రావిచెట్టు క్రింద బొజ్జ వినాయకుడున్నాడు. తూర్పుదిక్కుగాముఖం పెట్టుకుని,

ఊరి వైపు వామహస్తాన్ని అభయ మిస్తున్న రీతి నభినయిస్తూ కూర్చొని ఉన్నాడు. మా కారు మరి కాస్త ముందుకు సాగి ఉన్నతంగా ఆకాశం వైపుఎదిగి నిల్చున్న దేవాలయం ముందాగింది. నేను కారు లోంచి ఊరిని చూశాను. దీర్ఘాలోచనతో కూర్చున్న పెద మనుషుల మాదిరి తలల వంచుకున్నాయి పూరిళ్ళు. నెరసిన [illegible]ంటుకలు గాలిలో రెప రెప లాడుతున్నాయి. గుడికెదురుగా కుడి ఎడమలరెండు వీధులు బారులు తీర్చి ఉన్నాయి.నేను ఊరిని పరిశీలిస్తూండగా వీర్రాజు కారు దిగాడు. ఆడుకునే పిల్లలు కుతూహలంతో కారు చుట్టూ చేరారు. నేను కోవెల వైపుదృష్టి మరల్చాను. పడిపోతున్న ప్రహరీ గోడలు, తలుపులు లేని ముఖద్వారం; ఏ తుఫానుకో కూలిపోయిన ధ్వజ స్తంభం: ఎత్తైన కోవెల గోపురం, మొదటి చూపులోనే నాకు గోచరమైనాయి. పావురాలు గూళ్ళకు చేరినవి కాబోలు. దేవుడికి వింజామరాలు వీచుతూ ఏదో మొరపెట్టుకుంటున్నాయి.

వీర్రాజు డోర్ తెరుస్తూ, "రండి బాబూ! నేను తాతగారెతో మాటాడాను. తాతగారు మిమ్మల్ని తీసుకురమ్మన్నారు. చెప్పానుగా తాతగారు చాలా మంచివారని, రండి" అన్నాడు. నేను కారుదిగి రెండడుగులు వేసి ప్రక్కకు చూశాను. ముఖద్వారం నుండి గుడిలోకి వెళ్ళేదారిలో నున్న మెట్లలో పై మెట్టుమీద ఊర్ధ్వ పుండ్రములతో నా వైపే చూస్తున్న ఆరడుగుల ఎత్తుగలిగి వంగుతున్న నడుమును, నిలబెట్టుకునే ప్రయత్నంచేస్తున్న వృద్ధుని చూశాను. అప్రయత్నంగా రెండుచేతులుజోడించి నమస్కరించాను. అతను చిరునవ్వుతో నన్నాశీర్వదించాడు. వీర్రాజు నా సామాను పట్టుకుని ముందుకు నడిచాడు. పూజారి మాకుఎదురొచ్చి "రండి బాబూ!" అంటూ ఆలయ ప్రాంగణంలోనే ఒక మూల నున్న పెంకుటింటి వైపుతీసికెళ్ళాడు. "ఆలయంలో కెళ్ళి దేవుణ్ణి చూచి వద్దాము" అన్నాను వీర్రాజుతో. "అలాగే బాబూ! రండి"

అన్నాడు పూజారి. ఆలయ ప్రాంగణంలో నున్న బావిలోంచినీరు తోడిచ్చాడు వీర్రాజు. చేతులు,ముఖం,కాళ్ళు, కడుగుకొని ఆలయం లోకి ప్రవేశించాము. మాకన్నముందుగా గర్భగుడిలోప్రవేశించిన తాతగారు చీకటిలో తడుముకుంటూ నూనెదీపం వెలిగించారు. సాయంకాలపు వేళ గుడిలో, చీకటిలో నల్లరాతి విగ్రహాలముందు వెలుగుతున్న ఆ దీపంచిందే వెలుగులోకళ్ళు చించుకుని చూశాను. కోదండరాముడు, సీతాదేవి, లక్ష్మణమూర్తి విగ్రహాలు. చిరిగిన పాతబట్టల ధరించిదీనాతిదీనంగా నిలబడి ఉన్నాయి. మెడల్లో బంతిపూదండలు వ్రేలాడుతున్నాయి. చీకటిని చీల్చుతూ హారతి వెలిగించాడు పూజారి. ఆ వెలుగులో ఆమూర్తులనుచూచిదిగ్భ్రాంతి చెందాను. ఇది ఈ నాటిశిల్పంకాదు. కొన్ని వందల సంవత్సరాల నాటిది. కంచిలో ఈ శిల్పనిర్మాణం చూశాను. కనులు, ముక్కు ఆవిషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. దేవాలయాన్నిమూర్తులను చూస్తూంటే మొదటినుండీ దేవాలయం యిదేస్థితిలో ఉందని నమ్మకం కలుగలేదు. ఏదో కోణంనుండి పూర్వపు ఔన్నత్యంఉట్టి పడుతునే ఉంది.

పూజారి వణికే చేతులతో తీర్థం మా యిరువురికి యిచ్చి తులసీ దళాలను మాచేతులలో ఉంచుతూ" ఈ ఆలయం ఈనాటిది కాదు బాబూ! .... మాతాతల నాటిది .... నాముప్ఫయిఅదేళ్ళ ప్రాయంవరకు తెలుసు .... నాదేవుడు ఇప్పటిలా.... ఇలా బీదగా ఉండేవాడు కాదు. ఎంతటి వైభవం! .... ఎన్ని ఆభరణాలు!! ........ ఎన్ని వాహనాలు !!! .... అన్నీ పోయినాయి. .... దేవాలయం వివాదంలో పడింది. .... చూచేనాథుడు లేడు .... గోడలు కూలినై .... వంటశాలలు మంటకలిసినవి. .... ఈ దేవా లయానికి ఆస్థిలేదు. .... ఉన్నదంతా పరులహస్తమయింది. .... ఈ దేవాలయం యిప్పుడెవరికీ అక్కరలేదు. ఆస్థిలేదుకదా! రాబడీ

లేదు. .... అందుకనే ప్రభుత్వానికి అక్కరలేదీ కోవెల ....” వణికే గొంతుకతో తన ఆవేదన వెలిబుచ్చాడు పూజారి. “ఇది కార్తీక మాసం కనుక, ప్రక్క ఊరిలోనున్న శివాలయానికి వెళ్తారు. జనం కోవెలలోనికి ఒకసారి తొంగిచూస్తారుకనుక ఈ వేళప్పాళ్తూ ఈ దేవాలయం తెరచిఉంది. లేకపోతే మూసిఉండాల్సిందే .... కాని నేనలా ఉంచను. .... పాతరోజులు గుర్తుకు తెచ్చుకుంటూ ఇక్కడే ఇలా కూర్చుంటూ రండి బాబూ! .... కోవెల ఆవరణ చూపురుగాని” అన్నాడు నైవేద్యం పెట్టిన అరటిపళ్ళు మా కందించి, నే తనిని అనుసరించ బోతూ వీర్రాజు వైపు చూశాను. వీర్రాజు మనపక్కడ లేదని గ్రహించాను. వీర్రాజుని వెళ్ళమని చెప్పాను. వీర్రాజు పదేపదే నమస్కరిస్తూ నానుండి సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు. పూజారి వెనక ప్రదక్షిణంచేస్తూ కోవెలను పరిశీలించాను. ఉన్నతమైన కోవెల గోపురం. పూర్తి వైష్ణవ సాంప్రదాయం. కోవెల వెనుకగోడ మీద నృసింహావతారంలో ఉన్న శిల్పం తప్పదేవాలయం గోడలపై ఎట్టిశిల్పసంపద కానరాలేదు. అంతేకాక అంతటా సిమెంటు పూత పూసిన చిహ్నాలు కూడ నాకు గోచరమయినాయి. ఆ సిమెంటు వెనుకఎంత శిల్ప సంపదయినా ఉండవచ్చు. అది బయల్పడేసరికి కొన్ని దశాబ్దాలయినా అవవచ్చు. పూజారి చెప్పసాగాడు. అది ధాన్యాగారం .... దక్షిణంగా ఉన్న అవి వంటశాలలు .... ఉత్తరంగా కనిపించే మట్టిదిబ్బ ఒకప్పుడు స్వామివారి ఆభరణాలగది .... ఆ ప్రక్కనే వాహనశాలలు .... దాన్ని చూచారుగా .... అక్కడ ధ్వజస్థంభం ఉండేది .... కానియిప్పుడు లేదు. .... ఎందుకంటే అది అంతే!.... స్వామివారికెదురుగా స్తంభాలు పడిపోయిన ఎత్తైన ప్రదేశం చూశారుగా .... అది కళ్యాణమంటపం. ఆవేదికపై ఎందరి వివాహాలో జరిగాయి. నా వివాహం కూడా అక్కడే జరిగింది. మా పెద్దమ్మాయి పెళ్ళి కూడా అక్కడేజరిగింది. అదిచచ్చిపోయిన

సంవత్సరమే గాలివాన వచ్చింది. ధ్వజస్తంభంవిరిగిపడింది. కళ్యాణమంటపం ధ్వంసం అయింది. అయినా ఆ దిబ్బ మీదే మారెండోవమ్మాయి పెళ్ళి జరిపించాను. అది అత్తింటికెళ్ళి రెండు సార్లే వచ్చింది. అత్తవారు దాన్ని పంపారు. నాకు ఒక డేకొడుకు. కానీ వాడున్నా లేనట్టే. వాడు దేశాలుపట్టిపోయాడు. నా తరువాత నా తరపున స్వామివారి ముందు దీపంవెలిగించేవారెవరు. అయితే నాతోనేనా లోకం; నేతనువు చాలించిన తరువాత నైనా నాస్వామికి మంచిరోజులు రాకూడదూ? ........ ”

చీకటి పడమటి దిక్కుకు ఒదిగి దాక్కునే ప్రయత్నం చేస్తూంటే పున్నమి చంద్రుడుదయించాడు. చలిగాలులు వీచ సాగాయి. మాటిమాటికి ఆలయం సమీపాన ఉన్న పొన్నచెట్టు నుండి పొన్నపూవాసనలు రాసాగాయి. పూజారి తనింటికైపు నన్ను తీసికెళ్ళాడు. ద్వారానికి ముందుగా కుడివెడమల విశాల మైన రెండు మట్టి అరుగులున్నాయి. ఒక అరుగుమీద నులక మంచమంది. పూజారి రెండో అరుగుమీద కూర్చుంటూ నాకు మంచం చూపించాడు. నేను మంచంమీద కూర్చున్నాను. అతను హరికన్ లాంతరు వెలించి ఒక ప్రక్కగా నుంచాడు.

“ఊరు చూడబోతే చాలా చిన్నది. సమీపానపెద్దగా ఊళ్లేమీ ఉన్నటు కనిపించదు. మరి మీజీవనాధారం? ” అడిగాను.

అతను నవ్వాడు. బోసినవ్వు. ఆ నవ్వులోఏదో ధైర్యం. ఒక రకమైన తృప్తి. కనులు చిన్నవైనాయి. “నారాయణుడుండగా నాకు లోటేమిటి బాబూ! ఈ ఊరిలో ఒక ఉత్తముడున్నాడు..... నెలకో, రెండునెలలకో; అయిదో, ఆరోకుంచాల దంపుడుబియ్యం, పంపుతాడు. రాత్రివేళనేను భోజనం చేయను. వృద్ధాప్యం కదా! అవి నాకు సరిపోతాయి. కూర, నారకి ఈమూలనో ఆమూలనో

బీర, బెండ, పొట్ల, గింజలు పడేస్తా. నాహస్తవాసి మంచిది. గంపలుగా కాస్తాయి. కూరలు. అన్నీ నేనేం చేసుకుంటా? అందరం పంచుకుంటాం. ఈ మొక్కలను సంరక్షించే బాధ్యత పూర్తిగా మనుమరాలిదే. ఆమే మా దేవాలయంలో ఉదయం సాయంత్రం దీపం పెట్టడానికి నూనె, ఒత్తులు తెచ్చిపెడుతుంది. వీలయినప్పుడల్లా తనపెరటిలో పూచిన పూలమాలల కట్టితెస్తుంది. ఇక నాకేమి తక్కువ నారాముడుండగా? "

అంతలో కోవెలలో కాంశ్యగంట మ్రోగింది.

" ఎవరో వచ్చారు. " అన్నాను. " ఇంకెవరొస్తారూ? " అంటూ లేచి వెళ్ళాడతను. అతను వెళుతుంటే నా దృష్టి కళ్యాణ వేదికపై పడింది వెంటనే నా పెళ్ళి దృశ్యం నా కనులముందు కదిలింది అది పెళ్ళికాదు. ఒక ఆర్భాటం.... ఒక నాటకం.... అయినా నేను మరచి పోలేదు....ఇంకా....ఇంకా....ఆ కళ్ళు.... ఆ కన్నీళ్ళు.... ఆ వాద వివాదాలు....ఏమిటో గుర్తుకు తెచ్చుకోకూడదు....గాని....అన్నీ గుర్తే....ఆ గుడి....ఆ కళ్యాణ వేదిక... ఆ రాత్రి గుర్తే....కాని గుర్తుకు తెచ్చుకోకూడదు. గుర్తుకు తెచ్చుకున్నందువల్ల ప్రయోజనంలేదు. గతించిందేదో గతించింది..... గతించినది మరపుకువస్తే బాగానే ఉండును.... కానిమరపుకురాదు. రాధపెళ్ళి జ్ఞాపకానికి వచ్చినప్పుడల్లా.... ఆరాత్రి గుర్తుకువస్తునే ఉంటుంది. బహుశా......."

"వస్తాను తాతగారూ!" అనే గొంతుకతో నాఆలోచలు తెగాయి. ఆ కంఠం వినవచ్చిన వైపు చూశాను, లేతవెన్నెల్లో ఒక తెల్లచీర నడచిపోతోంది. ఊహించాను. గుడిలోదీపం వెలగటానికి కారకురాలు ఈమే అయ్యుంటుందని. తాతగారు వస్తూ" చూశావా బాబూ! ఈ రోజునవచ్చిన అతిధిని ఆదరించటమెలా అని ఆలోచి

స్తూంటే నారామచంద్రుడే దారి చూపాడు. ఇందాక అనలే; మా మనుమరాలని- ఆమే వచ్చింది ఇప్పుడు పిలిచినట్టుగా. ఈ రోజు కార్తీక సోమవారం. ఆమె ఉపవాస దినం. వీర్రాజు గురించి మీ గురించి చెప్పాను. ఈ ఉపవాస దినాన్న ఒక అతిధికి భోజనం పెట్టడంకన్నా ఆనందదాయకం మరేదీలేదు. ఈరోజురాత్రి కాయో పండో తిని ఉండనవసరంలేదు. అక్కడ భోజనం చేసివస్తే రాత్రి ఎలాగైనా యిక్కడ గడిచిపోతుంది. ఏంబాబూ సమ్మతమేకదూ!" అన్నారు. ఆహ్వానాన్ని నిరాకరించటం నాచేత కాలేదు. తాతగారు తృప్తిగా నవ్వి గోడకు చేరగిలా పడ్డారు.

"వీర్రాజు నా డ్రైవరు. అతను నా కెంతో సమీపంలో ఉన్నా అతని భార్య గయ్యాళితనం గురించిగాని, ఏ ఆదారమూ లేని అతని తల్లి గురించిగాని తెలిసికోలేకపోయాను. ఈ దారిని నేనొక్కడినే నాలుగైదుసార్లు ప్రయాణం చేశాను. కాని ఇంత పురాతనమైన దేవాలయం ఈ మారుమూల ఉందన్న విషయాన్ని తెలిసికోలేకపోయాను. ఈ రోజెందుకో వింతగా ఉంది. అన్ని రోజుల్లా కాదు. నా గురించినే నాలోచించలేక పోతున్నాను." అన్నాను. నా మాటలనుండి దేనినో గ్రహించినట్టుభావయుక్తంగా నవ్వారు తాతగారు.

వెన్నెల చిక్కబడింది. పొన్నచెట్టునుండి తీయని వాసనలు సన్నగా రాసాగాయి. గోపురంలో గూళ్ళుకట్టుకున్న పావురాలు తీరికగా మాటామంతీ సాగిస్తున్నాయి జంటలై. గాలివీచినప్పుడల్లా సన్నగా చలివేయసాగింది. ఊరింకా నిద్రపోలేదు. ఏదో మూలనుండి ఏదో సవ్వడి వినవస్తూనే ఉంది. తాతగారు హరికిన్ లాంతరును మా మధ్య నుంచుతూ, "బాబూ! మీ కెందరుపిల్లలు? ఏ ఊరు మీది? ఏ పనిమీద ఇటువచ్చారు?" అని అడిగారు.

ఫ్యాక్టరీ అసిస్టెంటు మేనేజరుగా ఉంటూ, ఎయిర్‌కండిషన్డు గదులలో, ఫోనుల ప్రక్క ఫేనుల, క్రింద, డన్‌లప్ పరుపుల మీద బాధ్యత కలిగిన వ్యక్తిగా, పరపతి కలిగిన మనిషిగా చెలామణి అవుతున్న నన్ను పిలిచి "నీలో ఉన్న నీవు ఎవరు?" అని అడిగే సాహసం ఎవరికీ లేకపోయింది. అవకాశమున్నా అడిగేపాటి ధైర్యం ఎవరికుంది? కాని నన్ను ఎవరైనా లాలించి అడిగితే నాలోని బాధను తనివితీర చెప్పుకుని బరువు దింపుకోవాలని ఎంతో ఉంది కాని ఎవరికి చెప్పాలి? ఎలా చెప్పుకోవాలి? చెప్పినా సానుభూతి చూపేదెవరు? కానితాతగారలా నన్నడుగుతూంటే నాగురించి అంతా చెప్పేసుకోవాలనిపించింది. "ఎలా ప్రారంభించను?"

"ఏం బాబూ మిన్నకుండిపోయారు?" తాతగారడిగారు.

"చెప్తాను తాతగారూ, అంతా చెప్తాను. నాకారు, నాహోదా ప్రక్కనుంచి నన్ను మనిషిగా చూచి చెప్పండి తాతగారూ. నా జీవితంలో కలిగిన బాధలు, ఆశాభంగాలూ, అన్నీ చెప్తాను. కాని ముందుగా నా కొక సమస్య. ఈ సమస్యకు పరిష్కార మార్గం చెప్పండి తాతగారూ?" అన్నాను.

"చెప్పండి బాబూ!" అన్నారు మాసిన గడ్డాన్ని ఎడమ చేత్తో రుద్దుకుంటూ.

"నాకు యిద్దరు కూతుళ్ళు తాతగారూ! పెద్దమ్మాయి రాధ పెళ్ళీడుకొచ్చింది. రాధ అందంగా ఆరోగ్యంగా ఉంటుంది. అందుచేత రాధను ఎవరైనా పెళ్లాడడానికి యిష్టపడుతున్నారు, కాని రాధను కోడల్నిగా చేసికోవాలని వచ్చేవారు మాత్రం నా ఆస్తిని అంతస్తునే చూచి రాధను యిష్టపడుతున్నారు. అంతేగాని



కథా నిలయం
3587
శ్రీకాకుళం

వివాహమనేది పవిత్రమైన కార్యమనే భావం వారిలో వున్నట్టు నాకు కనిపించడం లేదు. ఇరవై రోజుల క్రితంరాధకొక సంబంధం వచ్చింది. ఇరవై వేలు కట్నం యివ్వటానికి అంత ఎత్తున లాంఛనాలతో పెళ్ళి జరిపించటానికి నిర్ణయం జరిగింది. కాని రెండు రెండు రోజుల క్రితం యింకో పదివేలి స్తేగాని సంబంధం నిలిచేటట్టు లేదని వార్త. సంబంధం వదులుకోవటం యిష్టం లేక ఆ సొమ్ము యిద్దామని వెళ్ళాను. కాని వాళ్ళ గొంతెమ్మ కోరికలు వింటూంటే విసుగు, అసహ్యం కలిగాయి. ఏం చెయ్యాలో తోచక తిరిగి వచ్చేస్తున్నాను. వారు కోరిన కోర్కలు తీర్చలేని అసమర్థుడను కాను నేను. కాని ఈ దాహానికి అంతున్నదా? లేదా? అన్నదే నా బాధ. వీరి దాహాన్ని తీర్చటమేనా? లేక ఈ సంబంధాన్ని వదులుకోమంటారా? దయచేసి చెప్పండి" అన్నాను.

తాతగారు సన్నగా నవ్వారు. తరువాత అన్నారు; "మీ దగ్గర ధనమున్నదని తెలిసిన తరువాత అందరూ సుమారుగా ఇలానే ప్రవర్తిస్తారు. ఇంతదూరం వచ్చిన తరువాత వెనుకకు పోవటమెందుకు! "శుభస్య శీఘ్రం" ఇంతకూ అమ్మాయి యిష్టపడింది కదా"

తాతగారి ప్రశ్న నాలో కలత రేపింది. కొద్దిసేపు మాటాడలేక పోయాను,

"ఏం మాట్లాడరేం? అమ్మాయి ఏమంటున్నది?"

"పిల్లలికి యిష్టాలుంటాయి. వాటిని మన్నించటం కూడ మన ధర్మం. కాని కోరిన కోరిక సరియైనది కానప్పుడు ఎలా మన్నించగలం? నా కోరికను కాదని నన్ను నిరుత్సాహపరచిన పెద్దల లాంటి వాడను కానునేను. కాని రాధ కోరిక మాత్రం సుతరామూ నచ్చటం లేదు."

"ఇంతకీ అమ్మాయి ఏమంటున్నది?"

"ఏమున్నది? ఆస్థి, అంతస్థు ఏమీ లేని ఒక సామాన్యుని యిష్టపడుతోంది. చదువు వుంటే వుండవచ్చుగాని మూడు వందల రూపాయలు కూడా దాటని ఉద్యోగమతనిది. అతనికి మరి యే యితర ఆధారము లేదు. అందగాడుకాదు. అలా అని అనాకారీ కాదు. "అతడు మంచివారు నాన్నా" అంటుంది రాధ. అతను మంచివాడే కావచ్చు. కాని మేడల్లోనూ, కార్లలోనూ తిరిగిన రాధను ఆ బీద ఇంటికెలా పంపను? నా కూతురు సుఖపడాలని, కార్లలో తిరగాలని నాకుండదూ? మరి నా మాటలు రాధ ఎందుకు అర్థం చేసికోదు?"

"అయితే అమ్మడు యిష్టపడని పెళ్ళా?"

"ఆ....మరి....మరి....యిష్టపడని పెళ్ళని కాదు....కాని.... కాని....నా బాధ రాధకేం తెలుస్తుంది? "నీ కిష్టమే కదమ్మా!" అని అడిగితే "నీ యిష్టం నాన్నా" అంది. అది చాలదూ?"

"చాలకేం? బాగసరిపోతుంది? అందుకనే ఈవేలంపాటలో మీది పై చెయ్యి అనిపించుకుందామనుకుంటున్నారా?" భృకుటి ముడచితలనెగరేస్తుఅన్నారు. అతనిమాటలలోఎగతాళిరాకర్థమైంది.

'ఎగతాళీకాదు. ఉన్న మాట అన్నాను" అబ్బాయి మీకు అమ్మాయికినచ్చితే అమ్మడు యిష్టపడిన అతనికేయిచ్చి పెళ్ళి చేస్తే అమ్మాయి సుఖపడదా?ఆకట్నమేదో అమ్మాయి యిష్టపడినవానికే యివ్వచ్చుగా. ఉన్నవాడు లేనివాడివైపు చూడకపోతే అంతస్థులు అనే అడ్డుగోడలు పడిపోవటం ఎప్పటికి సాధ్యం? "ఆలోచించండి" అన్నారు. నే నేదో చెప్ప బోయే లోగా ఆయనే అన్నారు." మీయావ్వనంలో మీకోరిక ఎంత సవ్యమైనదని మీరు నమ్మారో,అమ్మడు

కోరిక కూడ అంత సవ్యమైనదని ఎందుకు సమ్మడు? మీరే కోర్కెను నెరవేర్చుకోలేక పోయారో నాకు తెలియదు. అదిసహేతుకమగునో కాదో నాకు తెలియదు. కాని అమ్మాయి కోరికలో ఖండించదగిన దేదీలేదు. ఒక ధనవంతుని కూతురు, ఒక గొప్పింటి పిల్ల, ఒకబీద యువకుని యిష్టపడుతోంది. దీనికెంతహృదయముపై శాల్యంకావాలి?"

"అంటే....అంటే...."

"నా అభిప్రాయాన్ని చెప్పాను. మిమ్మల్నలా చేయుమని కాదు. ఈ రాత్రి గడిస్తే మీరెవరో. నేనెవనో. కాని చివరిగా ఒక్క మాట చెప్తాను వినండి. ఏ కట్నాలకే వేలంపాటలో మీలాంటి డబ్బున్నవారు ప్రాణంలేని అమ్ముడు వస్తువులయి పోతున్నారో; ఆ వేలంపాటలో నిలిచి తన స్వంతంచేసికోలేని ఒక అమ్మాయి పెళ్ళి ఈ కారణం చేతనే పీటలమీదనే ఆగిపోయింది. అబ్బాయి అమ్మాయి ఒకరినొకరు యిష్టపడినప్పటికి కట్నంమనేది వారిని వేరు చేసింది. అంతస్థులు అనే మాటతో మీరు అమ్మడి మాటను మన్నించకుండా ఉన్నారు. ఈ విషయంలో నే చెప్పగలిగేది యింతకన్న ఏముంది?"

"అయితే రాధమాటనే కానివ్వమంటారా?"

"అది మీ యిష్టం. ఏ నిర్ణయించేసినా ఆ అభాగ్యురాలి పెళ్ళిలా మాత్రం పీటలమీద ఆగిపోయే పరిస్థితిని తెచ్చిపెట్టుకో కండి. అంతే" తాతగారి గొంతు బొంగురు పోయింది.

"అలాగే....ఇంతకీ ఎవరా అభాగ్యురాలు?"

"తాతగారండీ.... మరె.... మరే.... వంటయిపోయింది.... మరి....మరే....రమ్మన్నారండీ" వీధిలోంచి పరుగెత్తుకునివస్తూ అయిదేళ్ళ పాప చెప్పిన వార్త.

"ఆ! ఆ!....అలాగేవస్తున్నామని చెప్పు....పదండిబాబూ.... అమ్మాయి కబురుపెట్టింది." అంటూలేచారాయన.

"ఇప్పుడే ఆమె వెళ్ళారుగా. అప్పుడే వంటయి పోయుంటుందా?" అడిగాను.

"ఆడవారి సంగతి మనలా కాదు, కాళ్ళు కడుక్కోండి పచ్చడి రుబ్బేస్తా. పీట వాల్చుకోండి ముక్కలు వేయించేస్తా, అంటారు. అది అతిశయోక్తే అనుకోండి. కాని మా మనవరాలు సంగతలా కాదు. ఎంత పెద్దవంటయినా చిటికలో చేసి పడేస్తుంది. ఆయాసపడదు, కట్టిన చీరనలగదు. సిగలోపూలువాడవు" అన్నాడతను.

"అవును. కొందరికది వరం." అన్నాను.

"అదీ నిజమే. ఇలాంటి వరాలిస్తాడు కాబట్టే కొన్ని శాపాలు కూడా యిస్తాడు."

"అంటే!" ఏదో సంశయం మనసులో మెదలగానేఅన్నాను.

"మడి కట్టుకోండి. తరువాత మాట్లాడుకుందాం."

కోవెలకు చాలా సమీపంలోనే ఉంది ఆమె యిల్లు. ఆ యింటి ముందు పచ్చగన్నేరుచెట్టు, కొద్దిగ లోపల మందార మొక్కలు, ఇంకా లోపల పూల మొక్కలు వున్నాయి. చీకటిలో వాటిని పోల్చటం నాకు సాధ్యం కాలేదు. తాతగారు ఇంటి చుట్టూ వున్న కంచెను దాటుతూ, నా వైపు రమ్మనట్టు చూశారు.నేనతనిని అనుసరిస్తూ వెనుతిరిగి చూశాను. ఆకాశంలోకి కొద్దిగా ఎత్తుగా వచ్చిన చంద్రుని వెలుగులో ఆ యింటి ముందు వీధికి మధ్యగా వేపచెట్టు, ఆ చెట్టు క్రింద విశ్రాంతి తీసుకుంటున్న నాటు బండి చక్రాలు కనుపించాయి. తాతగారు అరుగెక్కారు. నేను నిత్య

మల్లి చెట్టు దగ్గర నిలబడిపోయాను సంశయిస్తూ, "రండి బాబూ!" అన్నారు తాతగారు. నేను ముందుకి అడుగెయ్యబోతూంటే "గాబులో నీళ్ళున్నాయి తాతగారూ!" అన్న ఆమె మాటలవిని తలఎత్తి చూశాను. గదిలో హరికేన్ లాంతరుంది. అది పూర్తిగ వీధిలోకి కనిపించటం లేదు. వెలుగు మాత్రం కనిపించసాగింది. ఆ వెలుగులో గాబు వైపు చూస్తున్న ఆమె కనిపించింది. తడి కాళ్ళను తుండుగుడ్డతో తుడుచుకుని ఇంట్లోకి నడిచాను. రెండవ గదిలో అరిటాకులో పదార్థాలన్నీ వడ్డించబడి ఉన్నాయి. అరిటాకు ముందు పీట, దానికి సమీపంలో ముక్కాలిపీట, దానిమీద లాంతరూ ఉన్నాయి.

"కూర్చోమనండి తాతగారూ!" అందామె మెల్లగా.

"కూర్చోండిబాబూ!" అన్నారు తాతగారు. నేను పీట మీదకూర్చున్నాను. చాలాసంవత్సరాలు టేబిల్‌మీల్సుకిఅలవాటుగా పడటం చేత పీటమీద కూర్చోవలసి రావటం నాకసౌకర్యంగానే ఉంది. ఆమె నేతిని అన్నంలోకవేసి "కూర్చోమనండితాతగారూ!" అంది. నేను కూర్చొనిఉండటం ఆమెకు కనిపించటం లేదా?— తలఎత్తి చూశాను. ఆమె వంటింటి గుమ్మం దగ్గర గుమ్మం అవతల నిల్చుని ఉంది. దీపం వెలుగు ఆమె ఎడమ చెంపమీద పడుతోంది. ముఖం నాకు స్పష్టంగా కనిపించటం లేదు. కాని ఆమె విశాలమైన కళ్ళు నా ముందున్న అరిటాకుమీదే ఉన్నాయి. విశాలమైన నుదిటి మీద రెండు కనుబొమ్మల మధ్య ఎఱ్ఱని కుంకుమ మెరుస్తోంది. ఆమె చేతిలో నేతిగిన్నె కాబోలు ఉంది. "కూర్చోండి బాబూ!" అన్నారు తాతగారు.

అప్పుడు నా కర్థమైంది. గ్లాసులో నుండి పురిసెడు నీటిని కుడి చేతిలోకిపోసుకుని ఔపోసనపట్టాను. ఈఅలవాటుమర్చిపోవా చాలా

ఏళ్ళయింది, కాని నటించాను. నేను సరిగా వర్తించినదీ లేనిదీ తెలిసి కోపటం కోసం అతని వైపు చూశాను. నా వైపు జాలిగా చూసి "వెయ్యి వెయ్యమ్మా!" అన్నారు తాతగారు. ఆమె నేతిని నా చేతిలో గుమ్మరించింది.

"కాలం మారుతోంది బాబూ! అందుచేత అలవాట్లు కూడా మారుతున్నాయి. కాని అనాదిగా ఉన్నట్టిది సనాతనమైనదీ మన సంస్కృతి, ఆచార వ్యవహారాలు సాంప్రదాయాలు రానురాను రూపుమాసిపోవటం బాధాకరం. మీవంటి ఆధునికుల మధ్య అవి రూపు మాసిపోయినంత మాత్రాన అవి లేవని, సమసిపోయినవనీ కాదు. ఉండవలసిన చోట అవి తప్పక చక్కగా పాలింపబడు తూనే ఉన్నాయి. ఉంటాయి. మీ వంటి వారి........"

"ఆయన్ని భోజనం చెనీయండి తాతగారూ!" అంటూ అతనిని వారించిందామె. కృతజ్ఞత చూపడం కోసం తల ఎత్తి ఆమె వైపు చూశాను. నన్నే చూస్తున్న ఆ కళ్ళు నా చూపు లకు చిక్కాయి. నేను నా చూపుల నిగ్రహించుకోలేక పోయాను. నా రక్తం చల్లబడింది. నాలుగైదు క్షణాలు ఆమెను అట్టే చూచి వుంటాను. ఆమె తలవంచుకుని వంటింటిలోకి వెళ్ళిపోయింది.

"ఏమిటిబాబూ! ఆలోచిస్తున్నారు?" అడిగారుతాతగారు. నేనులిక్కిపడ్డాను.

"లేదు.... లేదు.... మీరన్న మాటలేవో గుర్తుకొస్తే .... అంతే....మరేం....లేదు...." తల వంచుకున్నాను.

"అదా!....సర్లెండి....ముందు భోజనం చెయ్యండి. కొబ్బరి పచ్చడి కొద్దిగా వేయించనా? వంకాయి అల్లం వేసిన కూర.... మా మనుమరాలు బాగా చేస్తుంది....అదీ కలుపుకోండి....పెసర

పప్పులోకి కొద్దిగ నిమ్మబద్ద పిండుకోండి. బాగుంటుంది....అలాగ వంకాయకూర కలపండి....అమ్మాయీ చేతిమీద వెయ్యమ్మా!" కేక పెట్టారు తాతగారు.

ఆమె నడచి వచ్చిన సవ్వడి అయింది. ఆమె పాదాలు, పాదాలపై జీరాడే చీరకుచ్చిళ్ళు, కనిపిస్తున్నాయి. ఇంకా.... ఇంకా....తల ఎత్తి ఆమె ముఖంవైపు చూడాలని ఉన్నా ఆ సాహసం చేయలేక పోయాను. తాతగారు సూచించినట్టుగానే భోజనం చేస్తున్నాను. ఆయన ఆజ్ఞాపించినట్టుగానే వడ్డించి, వచ్చి నంత వేగంగా వెళ్ళిపోతోంది వంటింటిలోకి. చిక్కటి మజ్జిగలోకి ఉప్పును తెచ్చి ఉప్పును దీపానికి చూపించి అన్నంలోకి వేసి వెళ్ళిపోయిందామె.

"ఉప్పును దీపానికెందుకు చూపటం?"

"ఆయుషు పెరగాలనీ, అదో నమ్మకం," అన్నారాయన నమ్మకాన్ని కంఠంలో స్ఫురింపజేస్తూ. నేను తలదించుకుని భోజనం ముగించాను. తుండుగుడ్డతో చేతులు తుడుచుకుంటూంటే "నా మాటలతో మీ మనసు బెదిరిపోయిందేమో. మనసుపడి భోజనం చేశారా బాబూ!" అడిగారు తాతగారు.

వంటింటిలోకి వెళ్ళేఆమె వెనుతిరిగి ద్వారానికి ఆనుకుని నిలబడి పోయింది. "అలా అనుకోకండి. నేను చాల ప్రీతితోనే భోజనం చేశాను. ఒక్కమాటలో చెప్పాలంటే" జన్మానికి శివరాత్రి" అంటారే అదే ఈ రోజు నాకు. అయితే ఈ ఒక్క అవకాశం దేవుడు నాకు....ఎందుకు...."నాగొంతు బొంగురుపోయింది. కళ్ళు చెమ్మ గిల్లాయి. తలతిప్పుకుని "ఈరోజు నే మరువలేని రోజు. మీకు నా కృతజ్ఞత నెలా చెప్పాలో తెలియదు." అంటూ ఆమె వైపు

తిరిగాను. ఆమె తల ఎత్తలేదు. కనురెప్పలు బరువుగా వాలి ఉన్నాయి.

"ఉదయానికి వీర్రాజు తిరిగి రాకపోయినా నేవెళ్ళిపోతాను" తాతగారితో అంటున్నట్టు ఆమెవైపు తిరిగి అన్నాను. ఆమె ఒక్క సారి తలెత్తి తల దించుకుంది.

"వెళ్దామా? తాతగారూ!" అన్నాను. ఆమె దగ్గర సెలవు తీసికోవాలని ఉన్నా నోరుపెగల్లేదు. తాతగారు ముందుకు కదలి ఉద్యమిస్తూ "వస్తానమ్మాయి" అన్నారు. ఆమె కొద్దిగ తలఎత్తి మంచిదన్నట్టు తలతిప్పి, తలదించుకుంది. ముందుకు కదలబోయి ఆమెవైపు చూశాను. ఆమె ఇంటింట్లికి కదలిపోయింది. తాత గారు ముందునడుస్తూంటే కంచెదాటుతూ మరల వెనుకకు తిరిగి చూశాను. వీధి గుమ్మంలో నిలబడి ఆమె మా వైపే చూస్తోంది. ఆమెచేతిలో హరికెన్ లాంతరుంది. దాని వెలుగు ఆమె కంఠం దిగువ భాగాన్నపడుతోంది. ముఖంమీద దీపపుకాంతిపడకపోయినా వెలుగు పడుతోంది. ఆమె కళ్ళలో వెలుగుంది. నేను వెనుతిరగటం చూచి ఆమె కనులు దించుకుంది. నేను తాతగారిననుసరించాను.

మేము వెన్నెల్లో ఇల్లు చేరాము. నాలో అడగటానికి ఎన్నో ప్రశ్నలు. కాని అడగటానికి అవకాశం దొరకలేదు. నన్నువిశ్రాంతి తీసుకోమని తాతగారు దీపంపట్టుకుని ఆలయంలోకివెళ్ళిపోయారు. నేను బట్టలు మార్చుకుని ఆలయ ప్రాంగణంలో కొద్దిసేపు తిరిగి మరికొద్దిసేపు పొన్నచెట్టు క్రింద కూర్చుని మనసులో అలజడి రేగు తూంటే మరి కూర్చోలేక తిరిగి వచ్చాను. నేను తిరిగి వచ్చేసరికి తాతగారు ఇంటి అరుగుమీద ఈతచాప పరుచుకొని, భగవన్నామ స్మరణ చేసికుంటున్నారు. నా రాకను గమనించి నాకు పాలగ్లాసు

నందిస్తూ "తీసికొండి బాబూ!" నేను పాలు తీసికోవటం అయింది. "ఈ యింటిలో ఆ నులకమంచంతప్ప మరి మంచాలు లేవు. ఈ అరుగుమీద నేను పడుకుంటాను. ఆ అరుగుమీదమీరుపడుక్కోండి" అన్నారు.

నేను బెడ్డింగును పరచుకుని మౌనంగా మేనువాల్చాను. అయిదారు నిముషాలకుగాని అతనితో మాటాడటానికి అవకాశం రాలేదు. ఆయన ఈతచాపను పరచుకుని, దీపం తగ్గించి, మేను వాల్చి—

"బాబూ! నిద్రపోతున్నారా?" అని అడిగారు నేను మెలకువగా ఉన్నట్టు గ్రహించి.

"లేదు" అన్నాను.

"నిద్రవచ్చేటట్టు ఉందా?" అడిగారు.

'అంత వేగంగా వచ్చేటట్టులేదు" అన్నాను వెన్నెల్లో పొన్న చెట్టును చూస్తూ.

'అయితే నేనొక కథ చెప్పనా?"

'చెప్పండి"అన్నాను కొద్దిగా అతని పైపు తిరిగి.

"ఈకార్తీక మాసం ఎంతో ఉత్కృష్టమైన మాసం. ఎందుకంటే ఆ శివాలయంలో ఆకాశదీపాలు చూడండి.' అంటూంటే "తాతగారూ!" అని అడ్డుతగిలాను.

'ఏంబాబూ! వైష్ణవుడనై యుండి శివుడి గురించి మాట్లాడుతున్నానేమనా? శివ, వైష్ణవ భేద మేముంది? అదిగో ఆ పొన్న చెట్టునుచూడండి. అది వైష్ణవాలయ సమీపాన ఉండదగినది కాదు. ఎందుకుండకూడదనే నేనక్కడ నాటించాను."

"అదికాదు తాతగారూ! పురాణాలు నా కంతగా తెలియవు. అయినా తెలిసి కోవాలనే తహతహ నాలోలేదు. మీరు కథ చెప్తానంటే పురాణాలు చెప్తారనుకోలేదు.." అని కొద్దిసేపాగి "ఆమె గురించి చెప్తారనుకున్నాను" అని అన్నాను.

"ఎందుకలా అనుకున్నారు?"

"ఎందుకో చెప్పలేను. ఇందాక ఒక "నిర్భాగ్యురాలు" అని అన్నారే. ఆమే నా ఈమె? చెప్పండి. అవునా?" అన్నాను. స్వరం కొద్దిగా హెచ్చించి.

"అవును" అన్నారు నెమ్మదిగా.

"ఆమె ఇక్కడెందుకున్నట్టు? ఆమెకు ఎవరూ లేరా? తల్లీ తండ్రీ....భర్త పిల్లలూ...." ఆగాను. తాతగారు ప్రక్కకు తిరిగి "ఏం చెప్పను ఎలా చెప్పను? ఈమెకు తల్లీ తండ్రి ఉండేవారు. కాని యిప్పుడులేరు. పీటలమీద ఆగిపోయింది పెళ్ళి. మరి వివాహానికి యిష్టపడలేదు. అందుచేత భర్తలేడు, తమ్ముళ్ళు, చెల్లెళ్ళు పెళ్ళిళ్లుచేసుకునివెళ్ళిపోయారు. తల్లీ తండ్రీపోగానే గాలిలోదీపంలా ఉన్న ఈమెను విడిచిపెట్టబుద్ధికాలేదు. యౌవనం ఉడిగి శోక, వయసు వికసించే వయసులో ఆమెయోగినిగా ఉండటం నాకిష్టం లేకపోయింది. నచ్చచెప్పినాతో తిసికుని వచ్చాను" "అంటే....ఇంతకు ముందే ఈమె మీకు తెలుసా?" అడిగాను.

"తెలుసు. ఈమె తండ్రి ఈ ఊళ్ళోనే పుట్టి ఈ ఊళ్లోనే పెరిగి, ఉద్యోగరీత్యా పై ప్రదేశాలకు వెళ్ళిపోయాడు. వాడూ, నేనూ ప్రాణ స్నేహితులం. వాడింటిలో ఏ శుభకార్యం జరిగినా, కష్టం కలిగినా వెళ్ళాను ఒక్క ఆగిపోయిన ఆమె పెళ్ళికి తప్ప. నేనే వెళ్ళి ఉంటే ఆ పెళ్ళి ఆగేది కాదు. పెళ్ళిపీటలమీద పేచీకిసమాధానాన్ని

చెప్పేవాడిని. కక్కుర్తిపడ్డ కట్నాన్ని ముఖాన్న కొట్టేవాడిని. అప్పటికి మా అమ్మ బ్రతికే ఉంది. అమ్మనగలనన్నా అతని ముఖాన్న కొట్టేవాడిని. కాని నాకా అవకాశం రాలేదు. ఎన్నివిధాల చెప్పినా పెళ్ళికి ఒప్పుకోలేదు. ఇప్పటికప్పుడే, పది సంవత్సరాలు దాటిపోయింది. ఆమె ఈ ఊరొచ్చి తండ్రిమీద గౌరవం చేతనో, నా మీద భక్తిచేతనో, ఆమె మీది అభిమానం చేతనో ఊరు ఈమెకు అపకారం తలపెట్టలేదు. మరి నా తరువాత? అదే నా బాధ. నేను నమ్మిన, ఆమెసేవించిన రాముడు ఆమెకన్యాయం చేయడు. అదే నా ధైర్యం. ఈమె వయసు ముప్ఫయి దాటింది. ఈ కాలమానం ప్రకారం వివాహాని కనర్హమైన వయసుకాదు. పెళ్ళి గురించి నే ప్రస్తావన చేస్తే "నా పెళ్ళి అయిపోయింది తాతగారూ మళ్ళీనాకు పెళ్ళా!" అంటుంది. వివాహవేదిక మీదఆమెకు జరిగిన పరాభవాన్ని ఆమె మరచి పోలేక పోతున్నది. వివాహమనేది ఎంత పవిత్రమైన కార్యమో ఆమె బాగ గ్రహించింది...."

"ఈమెయింత కఠోర నిర్ణయాన్ని తీసికోక పోవలసింది. వివాహానికి అంగీకరించి ఉంటే బాగుండేది. మీరుచెప్పింది వింటే బాధగా ఉంది" అన్నాను.

"అంతేబాబూ! ఆలోచిస్తేనే బాధ అంతా! ఆలోచించకండి. హాయిగా నిద్రపొండి. ఉదయాన్నే ప్రయాణం కదా!" అంటూ గుండె మీదకి రెండు చేతులను తెచ్చుకుని "హరేరామ్" అంటూ నిద్రకుపక్రమించారు తాతగారు.

చంద్రుడు పొన్నచెట్టును దాటి చాలా ఎత్తుకి వచ్చాడు. వెన్నెల యిళ్ళమీద తెల్లని మంచులా కురుస్తుంటే, చలిగాలిలో పొన్నపూవాసనలు సన్నగా కదలి రాసాగాయి. ఆ సమీపంలో ఉండేచెట్టుమీద పిట్టలెందుకో అరచి తరువాత మిన్నకుండి పోయాయి.

తాతగారు నిద్ర పోతున్నారు. నాకు మాత్రం నిదుర రావటం లేదు. కాదు నేనే నిద్రను ఆహ్వానించలేక పోతున్నాను. బహుశా నేను సుఖంగా నిదురించే రాత్రులిక ఉండవేమో. ఎంతసేపని అలా గడపను? మరపురాని గతాన్ని సింహావలోకనం చేస్తూ ఎంతసేపలా వుండగలను? గడచిన కాలాన్ని ముందు కెలా తేగలను? పదహారు సంవత్సరాల కాలాన్ని దాటి వెనుకకుపోవాలి. ఎలా? ఇన్నినాళ్ళుగా నేననుభవిస్తున్న అసంతృప్తికి కారణాన్ని తెలిసికుని యింకాముందుకెలా పోగలను? ముందుకిపోక చేయుగలిగే దేముంది? నాకుహోదా ఉన్న ఉద్యోగ ముంది. ఇల్లుంది. వాకలుంది, బ్యాంకులో ఎకౌంటుంది. సంఘంలో పరపతి ఉంది. అయినా వెలితి.

తాతగారి వైపు చూశాను. ఆయన నిద్ర పోతున్నారు నెమ్మదిగా ప్రక్కమీదనుండి లేచాను. అడుగుల చప్పుడు వినబడ నీయక నెమ్మదిగా కదిలాను. ఆలయం ముఖ ద్వారం దగ్గరకొచ్చి ఆగాను. వీధంతా నిర్మానుష్యంగా ఉంది. రేడియమ్ డయల్ వాచీని చూశాను. మూడు గంటలు దాటింది. ముందుకు అడుగు వేశాను, "ఎక్కడికి?" నాలోని ఎవరో అడిగారు. "అక్కడికే" అన్నాను. ముఖద్వారందాటాను. అటూ ఇటూ చూశాను ఎవరూ లేరు. గబగబ అడుగులు వేసుకుంటూ ఆ యింటికి సమీపంగా వెళ్ళాను. ఇంతలో ఎవరో నా భుజం పట్టుకుని ఆపినట్టయింది. ముందుకు అడుగుపడలేదు. నిత్యమల్లి చెట్టు దగ్గరనిలబడిపోయాను. వెనుకకు పొమ్మని ఎవరో అంటున్నట్టనిపిస్తున్నా వెనుకకు మరలి పోలేక పోయాను. తలఎత్తి చూశాను. చంద్రుడు నడినెత్తిని నన్నే వింతగా చూస్తున్నాడు. చుట్టూ తారకలు నన్నే చూడ సాగాయి. గాలి నన్ను వాసనచూచి ఒకప్రక్కకు పరుగెత్తి పోయింది. గుండె బరువెక్కింది. కాని కంటి వెంట నీరు రాలేదు. నోటమాట పెగలి రాలేదు.

"ముందుకు పోనా? వెనుకకు పోనా? నాకెవరు చెప్తారు? నాకెవరు చెప్తారు. నాకెవరు?...." గట్టిగా ఎలుగెత్తి అరవాలను కున్నాను. చేతకాలేదు.

"ఈ రాత్రి మరల తిరిగిరాదు.... వెళ్ళు. వెళ్ళి ఆమెకు కనిపించు."

"వద్దు వెళ్ళకు. ఏమీ మిగలని నీవు అమెకు ఏమీ యివ్వ లేవు. నా మాటవిను." ఎవరో వెనుకకు లాగుతున్నట్టున్నా పట్టును తప్పించుకుని ముందుకురికాను. అరుగెక్కి తలుపు తట్ట బోయి, దగ్గరగా వేసివున్న తలుపులు తోసుకుని ఇంటిలోపలికి అడుగు పెట్టాను.

చిన్న బల్లపై కుడి చేతిమీద తలనుంచుకుని ఒక ప్రక్కగా తిరిగి నేలమీద కూర్చుని నిద్రపోతున్నదామె. ఆమెకు సమీపంలో హరికన్ లాంతరు మ్రాగన్ను పెట్టి నిద్రపోతోంది. ఇంటిలోకి నడిచి దీపం పెద్దది చేశాను. ఆ వెలుగులో చూశాను ఏ మార్పులేని "యామిని" పసుపు త్రాడు లేని బోసిమెడ. అప్పటికి యిప్పటికి అలాగే ఉంది.

"ఈ మెడలో నన్ను కాదని నీవు ఎవరిచేత మంగళసూత్రం కట్టించుకుంటావో చూస్తాను" అని నేనంటే దేనినో అర్థం చేసుకున్న దానిలా భావయుక్తంగా తాను నవ్వేనవ్వు నాకు గుర్తుకొచ్చింది. గుండెలో రక్తం ఒక్కసారి చల్లబడి పోయింది. మెల్లిగా ముందుకు రెండడుగులువేసి పరీక్షగా చూశాను. తడి ఆరీ ఆరని కేశాలు కొన్ని వక్షం మీద, మరికొన్ని భుజంమీద వ్యాపించి ఉన్నాయి. కనురెప్పలు తడిగా ఉన్నాయి.

బుగ్గల మీద కన్నీరు ప్రవహించిన జాడలు స్పష్టంగా దీపపు వెలుగులో మెరిశాయి. యామినిని నిద్రలేపి క్షమార్పణ

చెప్పుకోవాలి. ఆమె పట్టుదలను సడలింపజేయాలి. ఆమె సుఖం కోసం ఏమైనా చెయ్యాలి.—మోకాళ్ళపై కూర్చుని చేతిలోని రుమాలును ఆమె కనుఁకు దగ్గరగా, కన్నీరు తుడిచే ప్రయత్నంలో ఇంతకాలమైనా నా కొరకు వేచివున్న నిన్ను చూడక మరచిపోవాలనుకున్న నన్ను క్షమించు యామినీ!" అని గొణుగు కొని, చేతిని కొద్దిగా ముందుకు పోనిచ్చి "యామినీ, యామినీ" అని పిలిచాను. నా గొంతునుండి మాటలు అస్పష్టంగా వచ్చి వుండవు. మరోసారి పిలవబోయాను. వీధి గుమ్మం దగ్గర అలికిడి అయింది. వెనుతిరిగి చూశాను వీధి తలుపులు తెరుచుకున్నాయి. నేను లేచి నిలబడ్డాను.

లోపలికి అడుగుపెట్టిన తాతగారు త్వరగా నా పైపునకు వచ్చారు. నేను ఆయునకు అభిముఖంగా వెళ్ళాను. "మీతో మాట్లాడాలి. త్వరగారండి" అంటూ నా చేతిని పట్టుకుని ద్వారంపైపు లాక్కెళ్ళారు. నేనాయన వెనక వెళ్తూ వెనుతిరిగి చూడాలనుకున్నాను. కాని తాతగారు గుమ్మం దాటుతూ తలుపు మూయటం, తలుపు ధ్వనిచేయటం జరిగిపోయాయి. తాతగారు చెయ్యి పట్టుకుని లాగారు. వేపచెట్టు దగ్గరకి రాగానే నాచేతిని వదిలి "నా వెనుక రండి" అన్నారు. మేము కోవెల ముఖద్వారం దాటి లోపలికెళ్ళాం. ఆయన ఆగి వెనుతిరిగి నన్నుచూసి "మీలాంటి పెద్దల కిది తగునా?" అన్నారు. ఆయన ఉద్దేశ్యం నా కర్థమైంది. "తాతగారూ! నన్ను తప్పుగా అర్థంచేసికోకండి. నేనే దుశ్చింతతోనూ అక్కడికి వెళ్ళలేదు" అన్నాను.

అతను నావైపు తీక్షణంగా చూచి "అర్థరాత్రి ఒక పరాయి పురుషుడు, ఒక యౌవ్వనవతి దగ్గరికెళ్ళాడంటే...."

"కాదు తాతగారూ!.... నే నందుకు వెళ్ళలేదు...."

“మరెందుకు? నిలవ దీశారు.

“మీరునన్ను అసహ్యించుకోనంటే, ద్వేషించనంటే నిజం చెప్తాను. మాట యివ్వండి” అన్నాను.

“మాట యివ్వటం ఆ తరువాత ముందు మీ మీద సదభిప్రాయం ఏర్పడాలి అంటే మీరు నిజం చెప్పాలి” అన్నారు. మేము నెమ్మదిగా వున్న చెట్టు క్రిందికి చేరాము. తలఎత్తి అతని ముఖంలోకి చూచి మీరు “నన్ను క్షమించలేరు. అయినా నిజం చెపుతున్నాను. మీ మనుమరాలు “యామిని” ఇంత కఠోరదీక్ష సాగించటానికి కారకుడను నేను. నేనే తాతగారూ. ఇరవై ఏళ్ళ వయసుకూడా దాటని ఆ వయసులో తల్లి దండ్రుల మాటను కాదన లేక, వారిమాటనెదిరించలేకమనసారయిష్టపడిన‘యామిని’ని వివాహ వేదికమీద, కన్నీళ్ళలో వదలి వచ్చిన ఆ....ఆ....నేనే తాతగారూ. మీరే పేరు పెటినా నాకు సరిపోతుంది. పెళ్ళి చెడిపోయిన వారం రోజుల లోపుగానే వారంలో ఎక్కడికికో తరలి వెళ్ళిపోవడంచేత నేను “యామిని”ని కలియలేక పోయాను. “యామిని”ని దక్కించుకోలేక పోయాను. జీవితంతోరాజీపడ్డాను. కాని....కాని.... యామిని తన్ను సాధించు కుంటూ నన్ను సాధిస్తుందని నేననుక్కోలేదు. ఆమె కోసం నేనేం చేయగలనో నాకు తెలియుదు. ఏం చేయాలో తెలియుదు. “యామిని”ని ఒక్కసారి. ఒక్కసారి కలిసి క్షమార్పణ వేడుకుంటాను. అందువల్ల నా తప్పే ఒప్పవుతుందని కాదు. మనసున్న మనిషి చేయవలసిన పని అది నన్ను వెళ్ళనివ్వండి. ఒక్కసారి వెళ్ళనివ్వండి.” నా గొంతు వణికింది. అతని రెండుచేతులు పట్టుకున్నాను. తాతగారి కనులు ఎర్రబారినై . ఆవేశాన్ని అదుపులో పెట్టుకునే ప్రయత్నం చేస్తూ, “మీరు....మీరు ఆక్కడికి వెళ్ళవద్దు.... ఈ నాటి ఆమె పరిస్థితికి

కారణం మీరు అయినా మీరు కనిపించగానే సులభంగా క్షమి స్తుంది పిచ్చిపిల్ల. అదినాకు యిష్టంలేదు. ఇన్ని సంవత్సరా లయినా మిమ్మల్ని మరచిపోని నా తల్లి, రోజుకొకసారైనా మిమ్మల్ని తలచకుండా ఉండని నా పిచ్చితల్లి మిమ్మల్ని క్షమించకూడదు. మీ మంచితనాన్ని పొగడి. మీ వంచన కాహుతి కాకూడదు. మీరిక్కడుండకండి....వెళ్ళిపొండి....మీరంతా డబ్బు తినే మనుషులు...." అంటూ తల పట్టుకున్నారు తాతగారు. నేను గొంతు పెగల్చుకుని "నేను "యామిని"ని వంచించలేదు తాత గారూ! నన్ను మీవంటి పెద్దలంతా కలసి సాంప్రదాయం పేరిట, లాంఛనాల పేరిట వంచించారు. తాతరూ నేను పెళ్ళి చేసు కుని సుఖపడుతున్నాననేగా మీ బాధ. ఈ ఫొటోని గుండెకు దగ్గ రగా ఇన్ని సంవత్సరాలుగా దాచుకుని ఎంతగా సుఖపడుతున్నానో ఆలోచించండి. "యామిని" నన్ను క్షమించకూడదనేగా మీ ఉద్దే శ్యం. అలాగే కానివ్వండి. నన్నెవరూ క్షమించవద్దు. తప్పంతా నాదే. మిమ్మల్నందర్నీ నేనేవంచించాను. తప్పు నాదికాకపోతే రాధ పెళ్ళి నన్నింతలా బాధించేదికాదు...." నే నాగాను. "తాత గారూ....నే వెళ్ళిపోతానులెండి. నన్ను క్షమించకండి."

తాతగారు కళ్ళు తుడుచుకున్నారు. తాతగారి రెండు చేతులు పట్టుకుని "నాకోసం కాకపోయినా మీ పిచ్చి తల్లి కోసం ఒక సహాయం చేసిపెట్టగలరా?" అన్నాను. ఏమిటి అని అడిగిన అతని మాటలకు సమాధానమీయక అతని చేతినిపట్టుకుని ఇంటి వైపు లాక్కెళ్ళాను. నా బ్రీఫ్‌కేసు తెరిచాను. రాధ పెళ్ళికి ఎడ్వా న్సుగా ఇద్దామని తీసికెళ్ళి తిరిగి తెచ్చిన పదివేల రూపాయల కట్టలు నా చేతికందాయి. వాటి నందుకొన్నాను. తాతగారిచేతిలో ఉంచుతూ "ఇవి....ఇవి....యామిని కోసం....కాదు....కాదు....

ఇవి సరిపోవు నాకు తెలుసు.....ఎంత కావాలన్నా అంతా యిస్తాను.....యామిని సుఖపడాలి." డైరీలోంచి చెక్కుబుక్ నందుకుని పెన్ను తెరచి సంతకం పెట్టబోతూంటే తాతగారు నా చేతిని పట్టుకుని "ఏమిటిదంతా? ఎందుకివన్నీ?" అన్నారు. నేను తలపెత్తగానే "ఎందుకిలా పిచ్చిపడుతున్నారు?" అన్నారు. "అవును. పిచ్చే! యామినికేమిస్తే సుఖపడుతుందో తెలియదు. నేనివ్వగలిగిందే. యామిని నన్ను తిట్టనివ్వండి; అసహ్యించుకోనీయండి, ద్వేషించనీయండి, తన్ను నేను మరచిపోయానని నమ్మించండి....ఆమెకో నీడ....ఒప్పించండి....పెళ్ళిచేయించండి" కళ్ళలో నీళ్ళు తిరిగాయి. తాతగారు మాట్లాడలేదు. ఆయన కళ్ళ నిండా నీరుంది. "తాతగారూ!" అన్నాను.

"ఏడ్వడం లేదుబాబూ! నేను వేదాంతిని కాను, ఎవరిని ఏమనను?" అన్నారు జాలిగా. నేనాయన చేతిలో నుండి జారి పోతున్న నోట్ల కట్టనందుకుని, నా బ్రీఫ్‌కేసును ఖాళీచేసి అందులో డబ్బు సర్ది "పదిలపరచండి తాతగారూ!" అంటూ ఆయన చేతికందించాను. నేను బెడ్‌హోల్డాల్ సర్దుకున్నాను. తాతగారు ఇంటిలోకి వెళ్ళివచ్చారు. "రేపుదయం వీరరాజు వస్తే వెళ్ళిపోయానని చెప్పండి. అతనిని రెండు రోజులాగి రమ్మని చెప్పండి." అని చెప్పి ముందుకు అడుగు వెయ్యబోయి పర్సు తెరచి అందులో ఉన్న నోట్లను అతని చేతుల్లో బలవంతంగా ఉంచుతూ "ఉంచండి తాతగారూ మీరుణం తీర్చుకోవటం కష్టం. మీరు చెప్పినట్టుగానే రాధను ఆమె కోరుకున్నతనికే యిచ్చి పెళ్ళి చేస్తాను. యామినికి యాత్రతం ఏలోటూ రానివ్వకండి." అని చెప్పింది ఘూను నందుకున్నాను. సామానుని కారులో ఉంచి వచ్చేంత వరకు తాతగారలాగే నిలబడి ఉన్నారు. నేను దేవా లయంలోకి కదిలాను. నా వెనుకే తాతగారు వచ్చారు. తలుపుల

వెనుక శ్రీరాముడున్నాడు. నాకు కనిపించడు. కాని మనసులో చెలరేగే అలజడి కొంతమాత్రమైనా తగ్గుతుందేమోనని ఆశ. నేల మీద చతికిల పడ్డాను. సముద్రపు అలలు సముద్రపు ఒడ్డును బలంగా తాకుతున్నట్టుగా గుండెలో రక్తం ఎగతన్నుతోంది. తాతగారు నా భుజం మీద చెయ్యివేసి "బాబూ! ఎందుకు దిగులు? తప్పు! మనం ఎవ్వరమూ కాము. అంతే. వెళ్ళి అమ్మాయి పెళ్ళి జరిపించండి బాబూ! యామినికేలోటూ రాదు. సరేనా?" అంటూ లాలనగా మాటాడారు. ఏదో కొంత ఉపశాంతి. నెమ్మదిగా లేచాను. మెట్లు దిగుతూ ఆగి తాతగారి వంక తిరిగి "వెళ్తాను తాతగారూ!" అన్నాను, ఆయన చేతిని తాకి. ఆయన పలుకలేదు. ఎవరినో చూస్తున్నట్టున్నాయి యాతని చూపులు. స్వరం పెంచి "పెళ్ళి పోతున్నాను తాతగారూ! దయుంచండి" అన్నాను. ఆయన సర్దుకుని, చూపులు మరల్చుకుని "తప్పుబాబూ! అలా అనకూడదు. వెళ్ళి వస్తాననాలి." అన్నారు. తల విదుల్చుకున్నాను. "రాను తాతగారూ రాను ఈ వెళ్ళిపోవటమే వెళ్ళిపోవటం. సెలవియ్యండి."

తాతగారు మెట్లుదిగారు. "పోనీ బాబూ!....ఒక్కసారి.. ." నాకు తెలుసు తాతగారేమంటారో. యామిని నన్నింకా ఆరాధించడం నేను సహించలేను. యామిని నన్ను ద్వేషించాలి, అసహ్యించుకోవాలి. కారు వైపు పరుగెత్తాను. ఒక్కసారి అ ఇంటి వైపు చూశాను. కారు స్టార్టు చేశాను. కారు ముందుకు కదలటం లేదాన్నంతగా పోతోంది. యామినిని కలిసి మాటాడలేని నా మనసు మాత్రం వేగంగా వెనుకకు పరిగెడుతోంది. చెరువు మొదలులోకి వచ్చింది కారు. రావిచెట్టుక్రింద బొజ్జ వినాయకుడు నన్నే చిత్రంగా చూస్తూ పరిహాసంగా నవ్వుతున్నాడు. గాలి విసురుగా కదిలింది. పడమటకు వంగిన వెన్నెల చెట్లాకుల్లోంచి

వినాయకుడి మీద కదిలింది. అక్కడే కొద్దిసేపు కూర్చుని ఏదో చెప్పుకోవాలనిపించింది.

మనిషి మనిషిని ప్రేమిస్తాడు. ద్వేషిస్తాడు. సృష్టించిన శక్తికితప్ప మరెవరికీ అందుకు సరియైన కారణం తెలియదు. అందరూ వేదాంతులుకారు. కాలేరు. కాని చుట్టూ ఉన్నదంతా అస్థిర మని, అశాశ్వతమని నమ్ముతారు.అయినా ఆ అశాశ్వతమైన దాగిని ప్రేమించకండా ఉండలేరు. వాటికోసం వెఱ్ఱిపడకండా ఉండలేరు.

నేను బ్రతికి ఉన్నంతకాలంయామిని మీద భ్రాంతి ఉండనే ఉంటుంది. యామినిక్కూడా అంతే.

నేనుగాని యామినిగాని శాశ్వతంకాము. కాని అశాశ్వత మైన ఈ జీవితం శాశ్వతమైన దానిని దేనినో కోరుతోంది. నాకు తెలుసు. మనం పొందని దేదుందో అదే శాశ్వతం మనంపొందిన వన్నీ అశాశ్వతాలే. ఆ అశాశ్వతం నుండి శాశ్వతాన్ని పొందటం కోసమే ఆర్యులు తపస్సు చేసేవారేమో.

కారు నాపాను. దిగబోతున్న తరుణంలో నా చేయితగిలి క్రిందకు జారిపోయింది. అత్రుతగా చూశాను. అది నా బ్రీఫ్‌కేసు తాతగారికి యామినికోసం డబ్బుతో యిచ్చిన బ్రీఫ్‌కేసు. ఆయో మయంగా పెట్టును చూస్తూ పెట్టెను తెరిచాను. నేనిచ్చిన నోట్ల కట్టలలానే ఉన్నాయి, వాటి మీద నేను తాతగారి కోసం అసం పూర్ణంగా వ్రాసిన చెక్కు దాని ప్రక్కనే ఉంది నా చేతిరుమాలు వెంటనే అర్థమైంది. బ్రీఫ్‌కేసు నా కారులోకి ఎలా వచ్చినదీ. నా చుట్టూ చీకటి కమ్మింది. వెన్నెల తారుపూసుకుంది. యామిని యింటిలో మరచిపోయిన రూమాలును తిరిగి యివ్వటానికి యామినికి తప్ప మరెవరికి అవకాశం? వెంటనే ఊరులోకిపరుగెత్తు

కుని పోయి యామిని ముందు వాలిపోవాలనిపించింది. అటే రెండడుగులు వేసాను.

నేనిలుచున్న చోటునుండి, కొద్దిగ ఎదురుగా ఊరుదరి రేవులో ఒకతెల్లని చీర నీటిలో నుండి బయటకు వచ్చింది, నావైపే తిరిగింది. వక్షంపై కొంత వ్యాపించిన పొడవైన జుట్టు-వెన్నెలను కలుపుకుంటున్న ఆ చీకటిలో....నన్నే చూస్తున్న కళ్ళు....నే గుర్తుపట్టాను. ఆ నిల్చున్న తీరు నాకు తెలుసు. ఆమె యామిని. కొద్దిగ నీటినుంచి బయటకు వచ్చి వడ్డున చేరి కుంకుమ దిద్దుకుంది దీపపు ప్రమిదను వెలిగించింది. ఆ ప్రమిదను ఎందులోనో (బహుశా అరటి మట్ట అయ్యుంటుంది) ఉంచింది. దానిని రెండు చేతులలోనికి తీసికుంది. నీటిలోకి దిగింది. మోకాళ్ళ నీటిని దాటింది మొలదాటిందినీరు, ఇంకా ముందుకొచ్చి రెండు చేతులను పైకెత్తి పట్టింది. ఆ వెలుగులో యామిని కళ్ళను, కళ్ళలో వెలుగును చూశాను. ఇంకా ముందుకొచ్చింది. నీరు నాభిని దాటింది. ఇంకా ముందుకు వచ్చింది. నీరు వక్షాన్ని దాటింది. యామిని పొడవైన బాహువులను ముందుకు చాచి నీటికి, సమాంతరంగా ఉంచి వెలుగుతున్న దీపాన్ని నీటిపైనుంచి నెమ్మదిగా ముందుకు త్రోసింది. తాను ఒడ్డుకు చేరి ఆ కదలే దీపాన్నే (ఇప్పుడర్థమైంది. అదో ఓడ) చూస్తూ నిలబడి పోయింది. నేను యామినిని చూశాను. దీపాన్ని చూశాను. దీపమున్న ఓడను చూశాను. ఆ ఓడ నావైపే ప్రయాణిస్తోంది. యామిని చూపులతో ఆ దీపాన్ని నావైపే నెట్టుతోంది. ఆ దీపం దేదీప్యమానంగా వెలుగుతోంది. ఆ వెలుగే నా చుట్టూ నిండింది. "యామినీ—" బిగ్గరగా అరవాలను కున్నాను. నా మాట గొంతులోనే ఉండి పోయింది. ఊరు మేలుకుని చెఱువు చుట్టూ చేరసాగింది. యామిని ఊరిలోకి కదలిపోయింది. దరినున్న గట్టుపైని ఆకాశదీపం నన్నే చూడసాగింది.